# తిరగబడితే మనిషి

— వారాల కృష్ణమూర్తి



రంగడు రిక్షాలో కూర్చుని ఆలోచిస్తున్నాడు. రిక్షా ఎక్కడికీ పోవడం లేదు. రంగడి ఆలోచనలే పరి పరి విధాల పయనిస్తున్నాయి.

రిక్షాను పరీక్షగా చూశాడు రంగడు. తన జీవితాన్ని హరించే

రాక్షసిలా అనిపించింది ఒకసారి. ఆదుకునే అమృత వల్లిలానూ అనిపించింది మరోసారి. రెంటిలో ఏది సరైన పోలికో రంగడికి అర్థం కాలెదు.

పొద్దుటి నుంచి టీ నీళ్ళ మీద బతుకుతున్నందున ఆకలి సన్నగిల్లి అసహనం చోటు చేసుకుంది. ఆలోచనలు ఎటూ తెగక రంగడిని నానా ఇబ్బంది పెడుతున్నాయి. వాడిని వేధిస్తున్న సమస్య డబ్బు. దాన్నెలా సంపాదించాలో అర్థం గాక తికమక పడుతున్నాడు.

'డబ్బు! డబ్బు!!'

ఎన్ని సార్లు తనకు తెలీకుండానే ఆ మాట గొణిగాడో! జీవితంలో మొట్టమొదటి సారిగా డబ్బు సంపాదించడం ఎంత కష్టమో తెలిసొచ్చింది రంగడికి.

డబ్బుతో బతుకుని భగవంతుడే ముడివేశాడో, మనిషే ముడి పెట్టాడో అర్థం కాదు. డబ్బులేందే బతుకు లేదు- ఇది సత్యం.

ఇది వరకైతే ఈ సత్యాన్ని రంగడు నమ్మేవాడు కాదు.

రంగడికి నూనూగు మీసాలు రాగానే రిక్షా ఎక్కాడు. కొడుకు ప్రయోజకుడయ్యాడని తల్లి సంతోషించింది. కాని, ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు. రంగడి సంపాదనలో సగం మాత్రమే ఇంటి అవసరాలకు ఇచ్చేవాడు. మిగిలింది రంగడు సొంతానికి వినియోగించేవాడు.

కొందరికి కాఫీ అలవాటు. అది లేకపోతే కాళ్ళాడవు. మరికొందరికి సారా పడితే గాని అవయవాలు స్వాధీనానికి రావు. ఇంకొందరికి ఆడగాలి తగిలితే గాని ఊపిరాడదు. ఇలా చెప్పుకుంటే చాలా వుంటాయి అలవాట్లు. ఈ అలవాట్లన్నిటికీ డబ్బు కావాలి. డబ్బు తగలేస్తేగాని వాళ్ళకారోజు గడవక పోవచ్చు.

రంగడికి ఏ దురలవాటు లేదనే చెప్పాలి. రంగడికి ఉన్నదల్లా రోజూ సినిమా చూసే అలవాటు. సినిమాలు చూడ్డం వ్యసనం అంటే ఎవరూ నమ్మరు. ఒకవేళ అది వ్యసనమే అయితే సినిమాలని 'బాన్' చెయ్యాల్సి వస్తుంది.

రంగడి లాంటి వాళ్ళకు సినిమాలే ఆట విడుపు. సంతోషం కలిగినా, విచారం కలిగినా, ఏమీ తోచక పోయినా రంగడు సినిమాకు వెళ్తాడు. రంగడు రోజుకో సినిమా చూస్తాడనుకుంటే పొరపాటు. వాడికి నచ్చిన సినిమా రోజూ అయినా చూస్తాడు.

"ఒరే రంగా! రోజూ సినిమా

లేమిట్రా? కడుపు నిండుతుందా? కాలు నిండుతుందా? వూరికే డబ్బు లెందుకు తగలేస్తావురా?" అని మందలించేది రంగడి తల్లి.

"ఓలమ్మో!ఏటే అట్టాగంటావ్! సినేమా సూత్తాంటె పలావన్నం తిన్నట్టుంటుందే! పలావన్నం అంటే ఎంతవుద్ది? ఓపెల్లో మూడు రూపాయలె. మరి సినిమా ఒక్క రూపాయె గదె" అని నవ్వేవాడు రంగడు.

వీడిలా కుదురుకోడని, వీడి తిక్క కుదరాలంటే పెళ్ళి చెయ్యాల్సిందే-అనుకుని, రంగడికి ముత్యాలును కట్టి బెట్టింది రంగడి తల్లి. పెళ్ళయినా రంగడి అలవాటు మారింది కాదు.

"పిల్లా-పాప పుట్టుకొత్తున్నారు. ఇంకా ఇట్టాగె సినేమాలు సూత్తూంటే ఎట్టా? కాత్తో కూత్తో ఎనకెయ్యవా?" అంటూ బతిమాలింది ముత్యాలు.

"డబ్బు పాపిట్టిదే! దాన్ని దాసుకోరాదు. పిల్లలు పుట్టుకొత్తే ఆ బగమంతుడు లేడూ? ఆడె నీరు పోత్తాడు."

"ఆఁ – పోత్తాడు, పోత్తాడు. అటా అనుకునే ... అయ్య నిన్నూ నన్నూ ఇటా సేసి పొయ్యాడు. నీకు ఎటా సెబితే తెలుత్తాదిరా" అంటూ తల బాదుకుంది రంగడి తల్లి.

"శ—శ. కొంప నరకమైంది. నేనేమన్నా తాగుతున్నానా- పేకాడుతున్నానా- ముండలకు పెడుతున్నానా? ఎందుకట్టా ఏడిసిసత్తారు? శ-శ" అంటూ ఇంట్లోంచి పోయాడు రంగడు. ఆ పోవడం పోవడం నేరుగా సినిమాకి.

రంగడు తను చూడాలనుకున్న సినిమా పరిసర ప్రాంతాలకు ఎంత తక్కువ బేరం తగిలినా వెళ్తాడు. రంగడి వాలకం చూసిన సాటి రిక్షావాళ్ళు- 'సినిమా పిచ్చోడు' అని నవ్వుకునేవారు.

రాను రాను వాడి పిచ్చి ఎంత వరకు ముదిరిందంటే- రోజంతా రిక్షా బాడుగ పోను ఒక్క రూపాయి వస్తే చాలు- అనుకునేంత వరకూ ముదిరి పోయింది.

రంగడికి ఇద్దరు పిల్లలు. రంగడికి పిల్లలంటే పంచ ప్రాణాలు. రంగడి ఆరవ ప్రాణం మాత్రం సినిమా. పిల్లలకోసం ఎన్ని కష్టాలయినా సరే పడ్డానికి సిద్ధమే నంటాడు. అలాగే తన ఆరవ ప్రాణం కోసమూను.

రంగడి తల్లి ఏనాడో వాడి మీద ఆశలు- మొగుడి మీద పెట్టుకుని తుంచుకున్నట్టే- తుంచుకుంది.

కోడల్ని మాత్రం కొడుక్కన్నా ఎక్కువగా చూసుకుంటూ, కాసుకుంటూ వస్తుంది. ముత్యాలు మొగుడి వరస అర్థంగాక, అర్థం చేసుకోలేక వదిలేసింది.

కాని మొన్న .... మొన్నంటే మొన్న- పెద్దాడికి బాగలేదని చెబుతున్నా రంగడు రిప్వన సినిమాకు వెళ్ళి వచ్చాక తనిన్నాళ్ళూ మోసిన ఓర్పును చంపుకుని, మొగుడి మీద విరుచుకుపడింది.

"పిల్లాడి ఒల్లు పేలిపోతున్నా నీకు సీమ కుట్టినట్టు లేదా? సెబుతున్నా నేరుగా సినేమాకే సెక్కేశావు. పిల్లాడు మూసిన కన్ను తెరవకుండా పడుంటే- నువ్ గుడ్డిప్పుకుని సినేమా సూసి వత్తావా? సీ-సీ. అట్టాంటోడివి పెళ్ళెందుకు సేసుకున్నావ్? పందుల్లా పిల్లల్ని కంటే సరిపోయిందా? ఎదవ జలమ ఎందుకు?"

రంగడి అహం దెబ్బతింది భార్య మాటల్తో. ముత్యాల్ని జుట్టు పట్టుకుని వంగదీసి పిడి గుద్దులు గుద్దాడు.

"సీ సేతులు పడిపోను. దాన్నెందుకురా కొడతావ్?" అంటూ రంగడి తల్లి రంగడి జుట్టుపట్టి లాగింది.

"ఒకరికి తోడు ఇద్దరున్నారు కొంపలో, ఏం సేత్తున్నారే? అడ్ని డాటర్ దగ్గరకు తీసుకు పోలేరా?" అంటూ విసుక్కున్నాడు.

"డాటర్ దగ్గరికెల్లను ముల్లేది? నువ్ సంపాదించిందంతా పాత రేశావా ఇక్కడ?" రోషంగా అంది ముత్యాలు.

"మా కష్టం తిండికే చాలడం లేదు. నీ సంపాదన సినేమాలకే సాలకుంది. ఇంకెట్టా వత్తాదిరా డబ్బు?" కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అంది రంగడి తల్లి.

"థూత్—నా మీద పడి ఏడుత్తారు. సరే సావండి—నే పోతున్నా" అంటూ నడిరేత్తిరి రిక్షా ఎక్కాడు రంగడు.

రాత్రంతా రిక్షా తిప్పాడు. ప్రొద్దున రాత్రి సంపాదన లెక్కేశాడు. అయిదు రూపాయల చిల్లర సంపాదన జేబులోవేసుకుని రిక్షా ఇంటికి తిప్పాడు.

ఇంట్లోకి వస్తూనే, "ఎలా వుందే వాడికి?" అని అడిగాడు.

"అట్టాగె వుంది" అంది ముత్యాలు.

"సరే-పద డాటర్ దగ్గరకు!"

ముత్యాలు పిల్లాడిని తీసుకుని రిక్షా ఎక్కింది. రంగడు లేని

సత్తువను తెచ్చుకుని రిక్షాను ఆసుపత్రికి చేర్చాడు.

ముత్యాలు పిల్లాడిని తీసుకుని డాక్టర్ దగ్గరకు వెళ్ళింది.

డాక్టర్ పిల్లాడిని పరీక్షించి, "ఇది విష జ్వరం! ఇక్కడ మందులు లేవు. మీరు తెచ్చుకోవాల్సిందే! ఇదిగో" అంటూ ఏఏ మందులు కావాలో రాసిచ్చాడు—ఇహ వెళ్ళమన్నట్టు.

"బాబూ! పేదోల్లం. తమరే మందులేయండి! మీ రునం వుంచుకోము" అన్నాడు రంగడు.

డాక్టర్ రంగడిని చూసి, "అంటే మందులు వుంచుకునే లేవంటున్నా నంటావా?" అన్నాడు.

"అదిగాదు బాబూ! మా కాడ మందులకు డబ్బుల్లేవు!" చెప్పలేక చెప్పాడు రంగడు.

"అయితే నన్నేం చెయ్యమంటావ్? ఊఁ—వెళ్ళండి—వెళ్ళండి. ఈ గవర్నమెంట్ ఆస్పత్రిలో పన్చెయ్యడంలో వచ్చింది చిక్కు!" విసుక్కున్నాడు డాక్టరు.

ముత్యాలు పిల్లాడితో రిక్షా ఎక్కింది. రంగడు మాటామంతీ లేకుండా ముత్యాల్ని, పిల్లాడిని ఇంట్లో దింపి డాక్టర్ ఇచ్చిన మందుల చీటి తీసుకుని రిక్షా ఎక్కాడు మందులు తెద్దామని.

రిక్షా మందుల షాపు ముందు ఆగింది. మందుల ఖరీదెంతో తెలుసుకుందామని, "ఈ మందులున్నాయా బాబూ?" అని అడిగాడు రంగడు.

"ఆఁ" అన్నాడు షాపువాడు ఆ చీటి చూసి.

"ఎంతవుతుందండి?" భయం భయంగా అడిగాడు రంగడు.

ఎంతో లెక్క గట్టిన యజమాని, "నలభై ఎనిమిది రూపాయల ముప్పై పైసలు" అన్నాడు.

రంగడు ఆ చీటి అందుకుని రిక్షా వద్దకు చేరుకున్నాడు. ఇప్పుడు వాడి మనసంతా 'మందులకు డబ్బెలా సంపాదించడమా?' అని ఆలోచిస్తుంది.

'తన యజమానిని అడిగితే? అవును- కాదనడు. తనింత వరకూ ఆ బాబుని డబ్బడగలేదు. సంగతి సెబితే కాదనడు. ఔను- అదేదో సినిమాలో .... తనలాటోడే .... ఓ రిచ్చావాడు డబ్బు లేక సచ్చిపోదామనుకున్నప్పుడు...ఆడి యజమాని రిచ్చావాడి బుజం మీద సెయ్యేసి, 'ఏంటీ యదవతనం. నీ వల్లనే గందా నే నింత వాడినయింది. ఇయాల నిన్ను కాపాడుకోలేకపోతే నా జలమకు....' అదేదో లేద

న్నాడు.... యజమాన్నడిగితే?'

'యజమాన్నడిగేత్తా!'

* * *

"డబ్బా! నాదగ్గరెక్కడిదిరా?"

"బాబూ! అంత మాటనకండి!" ప్రాధేయపడ్డాడు రంగడు.

"ఏరా! నేనేమన్నా బూతు మాటన్నాన్రా. నాదెగ్గ రెక్కడిదిరా అంటే ఆ మాటనొద్దొంటావ్? ఏట్రా—ఏటి? నాకాడుంది. నేనివ్వ నురా....సరా! ఎల్లు-ఎల్లు. ఎదవ నాయాల!"

"పిల్లాడికి ఒంట్లో బాగలేక అడిగాను. అదే మీ పిల్లాడికి...."

"ఒరే రంగా! సెంటిమెంటుతో ఆడుకోమాక నా దగ్గర. ఎల్లు-నే నివ్వను."

"మీరే ఇట్టాగంటే ఇంకెవ రిత్తారు బాబు?"

"ఒరే! ఇహ నాబం లేదుగాని నువ్ రిక్షా ఆడ బెట్టి ఎల్లు. నీ కింక రిక్షా కూడా ఇవ్వను."

"అంత మాటెందుకు లెండి బాబూ! ఎల్తాను."

* * *

రిక్షా వాళ్ళకు రిక్షావాడే సాయ పడతాడు గాని మరోడు సాయం సెయ్యడు.

నిజమే ననిపించింది సినిమా నీతి. రంగడు తోటి రిక్షావాళ్ళను దేవులాడాడు. తలకో విధంగా చెప్పి తప్పించుకున్నారు. రంగడి కేం చెయ్యాలో పాలు పోలేదు. 'యాభై రోజులు సినిమా మానుకు నుంటే తన దగ్గర యాభై రూపాయ లుండేవి. తనెందుకు సినిమాలకు తగలేశాడు?' రంగడి బుర్ర మొదటిసారిగా ఆలోచిం చింది.

"రేయ్ రిక్షా!" అన్న కేకతో వాస్తవాని కొచ్చాడు రంగడు.

"వస్తావా?"

"ఆయ్! రండి బాబూ-కూర్చోండి! ఏడి కెల్లాల?"

"స్టేషన్‌కి. ఎంత?"

"తమరికి తెలీందేముంది బాబూ! ఎక్కండి."

"అక్కడి కెళ్ళింతరువాత పేచీ పెడతావ్. ఎంతో చెప్పు?"

"తమకు తోచినంత ఇవ్వండి బాబూ! కష్టం సూసి ఇవ్వండి-కాదన్ను. ఎక్కండి."

అతను రిక్షా ఎక్కాడు. రంగడు రిక్షా కదిలించాడు.

"బాబూ! టైం ఎంతయిం దండీ?"

"పన్నెండు. త్వరగా పోనీ!"

రంగడి రిక్షా వేగం పుంజు కుంది. నడిరాత్రి. అందులోనూ

చలికాలం. చలి చర్మాన్ని కొరుక్కు తింటుంది విపరీతంగా.

"బాబూ! తమ రేవూరెల్లాలి?" మాట కలిపాడు రంగడు.

"మద్రాసు."

"ఏం చేస్తుంటారు బాబూ?"

"సినిమాలు తీస్తుంటా."

'సి ని మా — సి ని మా!'.... రంగడి చెవుల్లో గింగుర్లు తిరుగుతుంది. మనసు సినిమా లోకంలో విహరిస్తుంది.

ప్రతి సినిమాలోనూ ఓ బీదోడు. వాడు రిక్షాలాగో, రాళ్ళు కొట్టో, బరువులు మోసో, హోటల్లో కప్పులు కడిగో బతుకు నెట్టుకొచ్చేవాడు. వాడిని చూస్తున్నంత సేపూ రంగడికి తన ప్రతిరూపం చూస్తున్నట్టుగానే వుండేది. వాడు పడే కష్టాలన్నీ తనవే అయినట్టు కుమిలిపోయేవాడు. అలా కష్టాలుపడి-పడి, చివరి సారి కష్టం వచ్చినప్పుడు, వాడి తల్లి జబ్బును బాగుచెయ్యను డబ్బు లేకపోతేనో, కొడుకు చావు బతుకుల్లో వుండి డబ్బు లేకపోతేనో, పెండ్లాం కాటికి పరుగులు పెడుతూంటే దాన్ని బతికించుకోను డబ్బు లేకపోతేనో, చెల్లెలి పెళ్ళికి కట్నం లేకపోతేనో, తమ్ముడి పరీక్షలకు డబ్బు లేకపోతేనో-ఆ సినిమావాడు తన ప్రాణాన్ని పణంగా పెట్టి కుస్తీ పోటీల్లో పెద్ద వస్తాదుల్ని ఓడించి డబ్బు సంపాదించేవాడు....వారం రోజులు సైకిల్ తొక్కి రక్తం కక్కుతూ గెల్చి బతుకు నిలబెట్టుకునేవాడు....తన కష్టాల్ని కథోరంగా పాడి, దేవుడి గంటలు బద్దలు కొట్టి మూర్ఛిల్లి, కళ్ళు తెరవగానే కావలసిన డబ్బు తెప్పించుకునేవాడు. ఇదేమీ కాకుంటే ఎప్పుడో కొన్న లాటరీ టిక్కట్టుకు లక్షల ప్రైజ్ వచ్చి వాడి కష్టాలు గట్టెక్కేవి.

రంగడి కళ్ళముందు తను చూసిన సినిమాలన్నీ గిర్ గిర్‌మని తిరిగాయి. ఆ సినిమాల్ని చూసినప్పుడు తన జీవిత పరిష్కారాలు అందులోనే వున్నట్టూ, తనూ ఎప్పటికో ఒకప్పటికి గొప్పవాడినైపోతానన్న నమ్మకం కలిగేది.

తనకు అందుబాటులో లేని వాటిని — ఆ ఛా (మా) యా చిత్రాల్లో అందుకుని ఊరడిల్లేవాడు.

రంగడి కిప్పుడు తెలిసొచ్చింది-సినిమాలకు బతుకులకు తేడా వుందని. సినిమాలోలా తన కష్టాలు తీర్చను ఏ పందాలు రావు, ఏ లాటరీ తగలదు, ఏ దేవుడూ దిగి రాడు-అని తెలుసుకున్నాడు. కాని

ఏ మూలనో ఇంకా ఆశతలెత్తుతూనే వుంది. ఆ రంగుల వల తన కష్టాల్ని లాక్కుపోతుందనే ఆశ... ఆ ఆశతోనే- "బాబూ! తవ(రే సినిమాలు తీశారు?" అని అడిగాడు.

"రిక్షారాముడు-చూశావా?"

"అదా బాబూ. బాబూ! ఆసినిమా ఎన్నిసార్లు సూశానో నాకే తెలీదు. మొన్న-మా పెద్దోడికి ఒంట్లో బాగ లేకున్నా ఎల్లా. నూర్రోజులయినా ఇంకా ఆడుతుంది.- బాబూ! ఆ రాముడు తన కూతురి జబ్బు నయం సెయ్యను డబ్బు లేకపోతే- విరిగిన కాల్ని లెక్క సెయ్యక రిచ్చా పందా


## శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద, ఫోన్ : 551, తెనాలి (ఎ.పి.)

బ్రాంచి : 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

### దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము



హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం-రండి.

బ్రాంచీ: బ్రాడీపేట 5వ లైను, గుంటూరు.

బ్రాంచీలు :— తిరుపతి, నెల్లూర్లలో త్వరలో తెరువబడును.

నికెల్లి, ఓటికాలితో రిచ్చానుతొక్కి పందెం గెలుత్తాడు బాబూ! ఓ చనం" అంటూ రిక్షా ఆపాడు రంగడు.

"ఏయ్! రిక్షా ఆపావెందుకు?"

"బాబూ! నేనూ రిచ్చారాముడు లాంటోన్నే. ఆడిలా నేనూ ఎన్నో కట్టాలు పడ్డాను. నేను పడ్డ కట్టాలు మర్చిపోను-మీ సినిమాలు సూసే వాడిని. సినిమాలో లాగే నా కట్టాలు గట్టెక్కుతాయని అనుకునే వాడిని. సంపాదనంతా సినిమాలకే పోశాను. బాబూ! ఇయాల నా పిల్లాడు సావు బతుకుల్లో వున్నాడు. వాడ్ని కాపాడుకోను ఏ పందాలు లేవు బాబూ! తమరే నన్ను కాపాడాలి. ఓ యాభై రూపాయ లిప్పించండి. పొద్దుటినుంచి మందుల సీటి జేబులో పెట్టుకు తిరుగుతున్నా-సూడండి బాబూ!" అంటూ చూపించాడు మందుల చీటి.

"డబ్బా! నా దగ్గరంత లేదు."

"మీ దగ్గరున్నంతే ఇవ్వండి బాబూ! రిచ్చాఓల్ల కట్టాలు మీకే బాగా తెలుత్తాయి గద బాబూ!" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

"నా దగ్గిర....లేదు మరి."

"బాబూ! ఓ సారి నన్ను సూడండి. పొద్దుటినించి డబ్బెలా సంపాదించాలా అని సత్తున్నా. కూడు కూడా తిన్లేదు నేను...."

"అయితే నన్నేం చెయ్యమంటావ్?"

"తమరు నాకు డబ్బు ఇచ్చి-నా కొడుకుని కాపాడండి."

"సరే-పద స్టేషన్కు. అక్కడ చిల్లర మార్చి ఇస్తా!"

"స్టేషన్కా! అక్కడ మార్చి ఇత్తారా! నమ్మమంటారా బాబూ? బాబూ! అక్కడ పోలీసులకు నన్నప్పగించరూ? తమరు డబ్బిత్తారా-నన్నే తీసుకోమంటారా?" అంటూ అతన్ని బలవంతంగా రిక్షా దింపి నోరు మూసి జేబులో చెయ్యి వేశాడు. చేతికి ఓ కట్ట తగిలింది. అది బయటకు తీసి చూశాడు. అది పది రూపాయల కట్ట.

పెనుగులాడుతున్న అతన్ని ఓ తోపు తోసి, "ఇంకో రెండుఫర్లాంగు లుంది స్టేషన్. తిన్నగా వెళ్ళండి. బాబూ! మమ్మల్ని మత్తులో పడేసి దోచుకోకండి. కాస్త మనిసి బతుకు ఎట్టా వుంటుందో ఆలోసించే మనిసి కథలు సినిమాలుగా తీయండి" అంటూ రిక్షా వెనక్కి తిప్పి జీవితంలో నెగ్గాల్సిన వాడిలా రయ్ మని దూసుకుపోయాడు.

మనిసి కథ లెలా వుంటాయి?
సినిమ—తిరగబడితే?
తిరగబడితే-మనిసి! *